క్లుప్తంగా

సమగ్రంగా భూ సర్వే



సర్వే పనులను పరిశీలిస్తున్న తహసీల్దార్

శ్రీరంగరాజపురం: మండలంలోని 2003 నాటి అసైన్మెంట్ భూములను సమగ్రంగా భూసర్వే నిర్వహించాలని తహసీల్దార్ లోకనాథపిళ్లై అన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా వీఆర్వోలు, సర్వేయర్లు 2003 క్రితం నాటి భూములను గుర్తించి పారదర్శకంగా సర్వే నిర్వహించాలని తెలిపారు. దుర్గరాజపురం, పద్మపురం గ్రామాల్లో జరుగుతున్న సర్వే పనులను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయన వెంట మండల సర్వేయర్ మురళి, డీటీ త్యాగరాజులు ఉన్నారు.

అగ్నిగుండ మహోత్సవం



భద్రకాళీ సమేత వీరభద్రస్వామి

నారాయణవనం: టీటీడీ అనుబంధ భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలలో శుక్రవారం ఉదయం మహిళలు పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించారు. సాయంత్రం అగ్నిగుండ ప్రవేశం భక్తిప్రపత్తులతో నిర్వహించారు. రాత్రి ఉత్సవమూర్తులకు పులివాహన సేవ నిర్వహించారు. భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించారు. కార్యక్రమాలను టీటీడీ స్థానిక ఆలయాల ఏఈఓ పార్థసారథి, సూపరింటెండెంట్ ఏకాంబరం, ఆలయ అధికారి నాగరాజు, భద్రతా జమేదార్ రాజశేఖర్ తదితరులు పర్యవేక్షించారు. శనివారం సాయంత్రం గజవాహన సేవ నిర్వహించనున్నట్లు ఆలయ అధికారి తెలిపారు.

బోరు మోటార్ల వైర్లు చోరీ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో వెస్టువరత్తూరు గ్రామ పంచాయతీ బోరు మోటారు విద్యుత్ వైర్లను దొంగలు చోరీ చేశారు. శుక్రవారం ఇది వెలుగులోకి వచ్చింది. మోటారు పనిచేయకపోవడంతో వెళ్లి పరిశీలించగా దొంగలు వైర్లను కట్ చేసినట్లు గుర్తించారు. చోరీపై గ్రామ సర్పంచ్ సుప్రియ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అలాగే ఇదే గ్రామానికి చెందిన వీ.రాఘవరెడ్డి, వీ.రాఘవులు, భాస్కర్‌రెడ్డి పొలంలో బోరు మోటార్ల వైర్లను సైతం కట్ చేసి చోరీ చేశారు. ఫలితంగా అటు తాగునీటి సమస్యలతోపాటు ఇటు పంటలకు నీరు పెట్టే పరిస్థితి లేక ఇబ్బందులు పడుతున్నారు. చోరీకి గురైన వైర్ల విలువ సుమారు రూ. 50 వేలు ఉంటుందని తెలిపారు.

క్రమశిక్షణతోనే విజయాలు సాధ్యం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న హరి మల్లికార్జున రెడ్డి, ప్రొఫెసర్ సరోజమ్మ

తిరుపతి సిటీ: క్రమశిక్షణతోనే విజయాలు సాధ్యమని ఎస్వీయూ సాంఖ్యక శాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ బి.సరోజమ్మ తెలిపారు. ఎస్వీయూ సాంఖ్యక శాస్త్ర విభాగంలో శుక్రవారం ఫేర్ వెల్ డేను ఘనంగా నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు క్రమశిక్షణ ఎంతో అవసరమన్నారు. నిరంతర కృషి, సాధించాలన్న తపన ఉంటే లక్ష్యాన్ని చేరుకోవచ్చన్నారు. డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన వర్సిటీ సాంఖ్యక శాస్త్ర అసిస్టెంట్ ప్రొఫెసర్ బి.హరి మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ సాంఖ్యక శాస్త్ర విద్యార్థులకు బ్యాంకింగ్, సాఫ్ట్‌వేర్, ప్రభుత్వ, ప్రయివేట్ రంగాల్లో అనేక అవకాశాలు ఉన్నాయని తెలిపారు. అనంతరం క్రీడా పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

సెప్టెంబర్ 8న సీపీఐ బహిరంగ సభ

తిరుపతి కల్చరల్: కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై సెప్టెంబర్ 8న తిరుపతిలో సీపీఐ ఆధ్వర్యంలో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పి.హరినాథరెడ్డి తెలిపారు. ఆ పార్టీ కార్యాలయంలో శుక్రవారం సీపీఐ జిల్లా శాఖ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దేశంలో అధ్యక్ష పాలన తీసుకొచ్చేందుకు అడుగులు వేస్తోందన్నారు. మణిపూర్‌లో మూడు నెలలుగా జరుగుతున్న అరాచకాలు, మారణకాండపై ప్రధాని మోదీ పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ప్రజా సమస్యలే ప్రధాన అజెండాగా సీపీఐ నిర్వహిస్తున్న బస్సు యాత్రకు విశేష స్పందన లభిస్తోందన్నారు. బస్సు యాత్ర ముగింపు సందర్భంగా తిరుపతిలో సెప్టెంబర్ 8న భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నటుట చెప్పారు. ఇందులో సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి రాజా, కార్యదర్శులు నారాయణ, ఎంపీ వినయ్ విశ్వం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ హాజరవుతారని తెలిపారు.

నగరి: నేత్రదేవత దేశమ్మ, నగరి: ప్రత్యేక అలంకరణలో వాసవీదేవి, నిండ్ర: అలంకరణలో అమ్మవారు, పాలసముద్రంలో..









వరప్రదాయనీ.. నమోస్తుతే

- భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు



కార్వేటినగరం: అమ్మవారికి పూజా సామగ్రి తీసుకెళుతున్న భక్తులు

నగరి: నమస్తేస్తు మహామాయే.. శ్రీ పీఠే సురపూజితే.. శంఖ చక్ర గధాహస్తే మహాలక్ష్మీ.. నమోస్తుతే! సద్గుణధాత్రి శీఘ్రఫలమియ్యవే.. సిరిసంపదల వరమహాలక్ష్మీ... నమోస్తుతే! అంటూ వేదపండితులు, భక్తులు వరలక్ష్మీ దేవిని కొలిచారు. శ్రావణమాసం రెండో శుక్రవారం సందర్భంగా వరలక్ష్మీ వ్రత పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు తమ గృహాల్లో వరలక్ష్మీ ప్రతిమ ఏర్పాటు చేసి వ్రతాలు నిర్వహించారు. మంత్రి ఆర్కేరోజా తన నివాసంలో వ్రతం ఆచరించారు. వ్రతనియమాల ప్రకారం పూజలనంతరం మహిళలకు పసుపుకుంకుమ, చీరలు, అన్నప్రసాదాలు అందించారు. నేత్ర దేవత దేశమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో విశేష పూజలు జరిగాయి. కామాక్షీ సమేత కరకంతేశ్వర ఆలయంలో వరలక్ష్మీ వ్రతం పూజలు నిర్వహించారు.

- కార్వేటినగరం: మండల కేంద్రంలోని శ్రీద్రౌపదీ, ధర్మరాజుల స్వామి ఆలయంలో వరలక్ష్మీ వ్రతాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారిని పట్టు వస్త్రలు, సుగంధ భరిత పుష్పాలు, ఆభరణాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షురాలు మోహన కుమారి మేళతాళాలతో పూజాసామగ్రిని తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. వ్రతంలో పాల్గొన్న భక్తులకు జాకెట్లు, గాజులు, పసుపు, కుంకుమ అందజేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు పి.సోమశేఖర్, ఉపాధ్యక్షుడు హరిబాబు, సభ్యులు బాబురెడ్డి, శివప్రకాష్‌మొదలి, క్రిష్ణయ్యయాదవు పాల్గొన్నారు.
- నిండ్ర: మండల కేంద్రంలోని వినాయకస్వామి ఆలయం, కేఆర్‌పాళెం మహాలక్ష్మీ ఆలయం, అత్తూరు గ్రామాల్లో వరలక్ష్మీ వ్రత పూజలు ఘనంగా జరిగాయి. మహిళలు అమ్మవారికి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.
- పాలసముద్రం: మండలంలోని అమ్మవారి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. ఇళ్లలో మహిళలు అమ్మవారి ప్రతిమను కొలువుదీర్చి వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. పూలు, పండ్లు సమర్పించి పూజలు చేశారు. ఆయా గ్రామాల్లోని ముత్తయిదువులకు పసుపు, కుంకుమ అందించారు.

భక్తిప్రపత్తులతో వ్రత పూజలు

వెదురుకుప్పం: వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని మండలంలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. డీఆర్ఎస్‌కండ్రిగ సమీపంలోని అరుణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయం, చవటగుంటలో ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయం, మీనాక్షి సమేత ఆవుదేవర నందీశ్వర స్వామి, నృసింహస్వామి ఆలయాల్లో మహిళలు పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు. అమ్మవారి ప్రతిమను ఉంచి ప్రత్యేకంగా అలంకరించారు. పూలు, పసుపు, కుంకుమ, పూజా సామగ్రిని అమ్మవారికి సమర్పించి భక్తి ప్రపత్తులతో వ్రతాన్ని ఆచరించారు.



వెదురుకుప్పం: నృసింహస్వామి ఆలయంలో వ్రతమాచరిస్తున్న మహిళలు



వెదురుకుప్పం: ద్రౌపదీ దేవి ఆలయంలో..

మెడికల్ క్యాంపు నిర్వహణపై సమీక్ష



సిబ్బందికి సూచనలు అందిస్తున్న రవిరాజు

నగరి: సీఎం నగరి పర్యటన సందర్భంగా ఏర్పాటు చేయనున్న మెడికల్ క్యాంపును సిబ్బంది విజయవంతం చేయాలని జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి డాక్టర్ రవిరాజు అన్నారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని పుదుపేట నార్త్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో వైద్యులు, సిబ్బందితో సమీక్షించారు. ప్రతి గ్యాలరీలో మెడికల్ స్టాఫ్ అలాట్మెంట్, మెగా మెడికల్ క్యాంపులు, రోడ్ షోలో మెడికల్ క్యాంపుల నిర్వహణపై పలు సూచనలు చేశారు. డెమో జయరాముడు, హెచ్‌ఈ రాజేంద్రప్రసాద్, విజయపురం, కదిరేపల్లి, నిండ్ర, బుగ్గ అగ్రహారం, సత్రవాడ, పుదుపేట యూపీహెచ్‌సీ వైద్యాధికారులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శిగా మేరీ



నిండ్ర: వైఎస్సార్‌సీపీ చిత్తూరు జిల్లా కార్యదర్శిగా మేరి నియమితులయ్యారు. నిండ్ర మండలానికి చెందిన ఈమె గతంలో మండల మహిళా అధ్యక్షురాలిగా, జిల్లా మహిళా విభాగం కార్యదర్శిగా పనిచేశారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ.. తనకు పదవి రావడానికి సహకరించిన మంత్రి రోజాకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు. జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు.

నగరి- ఏడుగట్లు ఆర్టీసీ బస్సు ప్రారంభం

- 14 ఏళ్ల అనంతరం పునరుద్ధరణ
- మంత్రి ఆర్కే రోజా చొరవతో నెరవేరిన ప్రజల ఆకాంక్ష



బస్సులో ప్రయాణిస్తున్న మంత్రి ఆర్కేరోజా

నగరి: పద్నాలుగేళ్ల క్రితం వరకు ఉన్న బస్సు సౌకర్యం టీడీపీ పాలనలో ఆగింది. అప్పటి నుంచి బస్సు కోసం ఎదురుచూపులు తప్ప బస్సు జాడ కనిపించలేదు. తమ గ్రామానికి బస్సు సౌకర్యం ఉంటే బాగుంటుందన్న వారి ఆకాంక్ష అందని ద్రాక్షగానే మిగిలిపోతూ వచ్చింది. ఇటీవల ముడిపల్లి గ్రామంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో గ్రామస్తులు బస్సు సౌకర్యం లేకపోవడంతో ఎదురయ్యే ఇబ్బందులను మంత్రి ఆర్కేరోజా దృష్టికి తెచ్చారు. నగరి పట్టణానికి రావాలంటే ఆటోలు, ఇతర వాహనాల్లోనే రావాల్సి ఉందని.. ఈ కారణంగా తమకు ఖర్చులు కూడా ఎక్కువవుతూ ఉందని మహిళలు మొరపెట్టుకున్నారు. ప్రజలకు బస్సు అవసరాన్ని గుర్తించిన మంత్రి ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించారు. ఆర్టీసీ అధికారులతో చర్చించారు. మేళపట్టు, ముడిపల్లి, ఏడుగట్లు ప్రజల నిరీక్షణకు తెరపడింది. నూతన బస్సు ప్రారంభమైంది. పుత్తూరు–ఏడుగట్లు బస్సును మంత్రి ఆర్కేరోజా ముడిపల్లిలో శుక్రవారం ప్రారంభించారు. బస్సు టికెట్టు కొని అందులో ప్రయాణించడం ప్రత్యేకత సంతరించుకుంది. పుత్తూరు నుంచి ఉదయం 6 గంటలకు బయలు దేరే ఈ బస్సు సాయంత్రం 6.05కు తిరిగి పుత్తూరుకు చేరుకుంటుంది. ఈ మధ్య సమయంలో ఐదు ట్రిప్పులు నగరి నుంచి ఏడుగట్లు వరకు వెళ్లడమే కాక అందులో ఒక ట్రిప్పు ఏడుగట్లు నుంచి తిరుపతికి వెళుతుంది. ఇకపై గ్రామం నుంచి పట్టణానికి చేరుకోవాలంటే తక్కువ ఖర్చుతో ఆర్టీసీ బస్సులోనే చేరుకోవచ్చని మంత్రి తెలిపారు. అడిగిన వెంటనే సమస్యలు పరిష్కరించిన మంత్రి ఆర్కేరోజాకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ మంగమ్మ, ఏఎంఎఫ్ టీజీ బాబు, స్థానిక ప్రజా ప్రతినిధులు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

పుత్తూరు ఎన్‌సీసీ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి

పుత్తూరు రూరల్: తిరుపతిలో నిర్వహించిన ఎన్‌సీసీ కంబైన్డ్ ఆన్యూవల్ ట్రైనింగ్ క్యాంప్ (సీఏటీసీ–5)లో పుత్తూరు అవార్డులు ప్రతిభ చాటారు. విద్యార్థులను స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాసులురెడ్డి అభినందించారు. శుక్రవారం కళాశాలలో జరిగిన అభినందన సభలో ప్రిన్సిపల్ మాట్లాడుతూ.. బీకామ్ తృతీయ ఏడాదికి చెందిన ఈ.ఇలంగోవన్ మ్యాప్ రీడింగ్‌లో స్వర్ణ పతకం, బీఎస్సీ ద్వితీయ సంవత్సరం విద్యార్థి అబ్దుల్ కలామ్ క్యాంపు సీనియర్ మెరిట్ అవార్డులను కైవసం చేసుకున్నట్లు తెలిపారు. ఎన్‌సీసీలో పాల్గొనే విద్యార్థులకు క్రమశిక్షణ, దేశభక్తి అలవరుతుందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ కోటేశ్వరయ్య, ఎన్‌సీసీ అధికారి శ్రీనివాసులు, అధ్యాపకులు నరసింహులు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం



తాగునీటి బోరుకు అమర్చుతున్న మోటారు

వెదురుకుప్పం: మండలంలోని తూర్పు దళితవాడలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారానికి అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. తాగునీటి సమస్యపై గ్రామస్తులు ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన మంత్రి వెంటనే జీజీఎంపీ నిధులతో సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. దీంతో రూ.20 వేలు వెచ్చించి కొత్త బోరు మోటారుతో పాటు పైపులు అమర్చి సమస్యకు పరిష్కారం చూపారు. అదే విధంగా వెదురుకుప్పం పంచాయతీలో కొత్తగా 5 బోరు మోటార్లు అమర్చి నీటి సమస్యను పరిష్కరించామని స్థానిక సర్పంచ్ శిల్ప తెలిపారు. సమస్యను పరిష్కరించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

పాము కాటుకు బాలుడి మృతి





చక్రి మృతదేహం, చక్రి (ఫైల్)

శ్రీరంగరాజపురం: పాము కాటుకు బాలుడు మృతి చెందిన సంఘటన ఎస్ఆర్‌పురం మండలం ఉద్దండమహారాజపురంలో విషాదాన్ని నింపింది. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన గోపి, గాయత్రి దంపతుల కుమారుడు చక్రి గురువారం ఇంట్లో నిద్రిస్తున్నాడు. అర్ధరాత్రి సమయంలో పాము కాటు వేసింది. గమనించిన కుటుంబ సభ్యులు బాలుడిని 108లో చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళుతుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. నీకు అప్పుడే నూరేళ్లు నిండిపోయాయా నాయనా.. ఇక ఎవరి కోసం బతకాలి రా అంటూ తల్లిదండ్రులు రోదించడం అక్కడి వారిని కంటతడి పెట్టించింది. ఏకైక కుమారుడు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

సారా విక్రేత అరెస్ట్



నిందితుడి అరెస్టు చూపుతున్న ఎస్ఈబీ సిబ్బంది

నగరి: మున్సిపల్ పరిధి సత్రవాడ దళితవాడలో సారా విక్రయిస్తున్న టీఎస్ కుప్పయ్య (45)ను స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ వర్ధనాదేవి అరెస్ట్ చేశారు. సిబ్బందితో కలిసి శుక్రవారం ఆ ప్రాంతంలో తనిఖీలు నిర్వహించారు. కుప్పయ్యను అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 5 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. రిమాండ్ విధించడంతో సత్యవేడు సబ్‌జైలుకు తరలించారు. ఎస్ఐ భానుప్రకాష్, హెడ్‌కానిస్టేబుల్ బాలముని, మోహన్‌రెడ్డి, పీసీలు హిదయతుల్లా, కార్తిక్, గురవయ్య పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాల పరిశీలన

నిండ్ర: మండలంలోని జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని హౌసింగ్ ఏఈ శ్రీధర్‌రాజు అన్నారు. శుక్రవారం ఇరుగువాయి గ్రామంలో ఇళ్ల నిర్మాణాలను ఆయన పరిశీలించారు. లబ్ధిదారులకు ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

సబ్ సెంటర్‌కు కాన్సంట్రేటర్ వితరణ



కాన్సంట్రేటర్‌ను అందజేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

వెదురుకుప్పం: మండలంలోని ఆళ్లమడుగు ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రానికి లయన్స్ క్లబ్ వెదురుకుప్పం శాఖ శుక్రవారం ఆక్సిజన్ కాన్సంట్రేటర్‌ను వితరణ చేసింది. లయన్స్ క్లబ్ మండలశాఖ అధ్యక్షుడు గుణశేఖర్ చేతుల మీదుగా పచ్చికాపల్లం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి ప్రవీణకు అందజేశారు. లైన్ భానుమూర్తి రెడ్డి సహాయంతో సుమారు రూ. 1.50 లక్షలు విలువ చేసే పరికరాన్ని వితరణ చేశారు. లయన్స్ క్లబ్ జోనల్ చైర్‌పర్సన్ రామచంద్రారెడ్డి, తిరుపతి టెంపుల్ సెక్రటరీ దేవ రాజులు రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ ధనంజయరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ లోకనాథ రెడ్డి, మాజీ సర్పంచ్ రామచంద్రారెడ్డి, దామోదరరెడ్డి, పెనుమూరు లయన్స్ క్లబ్ కార్యదర్శి జితేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

దాడిని నిరసిస్తూ న్యాయవాదుల ఆందోళన



విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

పుత్తూరు రూరల్: న్యాయవాదిపై దాడిని నిరసిస్తూ పుత్తూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు శుక్రవారం విధులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దామోధర్‌రెడ్డి మాట్లాడుతూ.. సీనియర్ న్యాయవాది మురగేశన్‌రెడ్డి క్లయింట్ పార్థసారథి చెక్కు బౌన్స్ కేసును ఫైల్ చేశారని తెలిపారు. అయితే క్లయింట్ వాయిదాలకు హాజరుకాకపోవడంతో కేసును రాజీ చేసుకోవచ్చు కదా అంటూ సలహా ఇచ్చారని తెలిపారు. దీనిపై ఆగ్రహించిన పార్థసారథి తన స్నేహితులైన శ్రీనివాసులురెడ్డి, విజయలక్ష్మీతో న్యాయవాది మురగేశన్‌రెడ్డిపై దాడి చేయించడంతో పాటు ఆఫీసును ధ్వంసం చేయించారని ఆరోపించారు. బయటకు వస్తే చంపుతామంటూ హెచ్చరించారని తెలిపారు. పుత్తూరు పోలీసులు నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచాలని డిమాండ్ చేశారు.

కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాం

న్యాయవాది మురగేశన్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు. నిందితులను త్వరలోనే కోర్టులో హాజరుపరుస్తామని చెప్పారు.

ఉన్నత విద్యే బంగారు భవిష్యత్తుకు పునాది



కబడ్డీ విజేత జట్టుకు బహుమతి ప్రదానం చేస్తున్న ప్రిన్సిపల్ అన్నపూర్ణ, బండి గోవర్ధన్‌రెడ్డి

వెదురుకుప్పం: ఉన్నత విద్యే బంగారు భవిష్యత్తుకు పునాది అని కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ బండి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని చవటగుంట డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వీడ్కోల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మారుమూల గ్రామాల్లోని పేద విద్యార్థులకు ఉన్నత విద్యను అందుబాటులోకి తీసుకురావాలన్న సంకల్పంతో ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి మండలంలో డిగ్రీ కళాశాలను మంజూరు చేసినట్లు గుర్తు చేశారు. ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో మెలగి ఉన్నత విద్యను అభ్యసించాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకుని ఇటు తల్లిదండ్రులకు అటు కళాశాలకు కీర్తిప్రతిష్టలను తీసుకురావాలని కోరారు. కళాశాలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు మంత్రి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని తెలిపారు. విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని భావితరాలకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. అనంతరం గృహసారధుల మండల ఇన్‌చార్జి బట్టే సుబ్రమణ్యం మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు ప్రథమ ప్రాధాన్యతను ఇస్తున్నట్లు పేర్కొన్నారు. వివిధ రంగాల్లో ప్రావీణ్యం చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ అన్నపూర్ణశారద, వైస్ ప్రిన్సిపల్ ప్రభాకర్‌రావు, ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు మరకాలకుప్పం రామయ్య, కమిటీ డైరెక్టర్ దేవరాజులు, అధ్యాపకులు లావణ్య, భీమమోహన్‌రావు, మంగళగౌరి, శంకర్‌రెడ్డి, వెంకటేశ్, బాబు పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

తిరుమల: శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వీరిలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, సినీ గాయకురాలు మంగ్లీ ఉన్నారు. వారికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా, అధికారులు లడ్డు, ప్రసాదాలతో సత్కరించారు.

చంద్రబాబు, లోకేష్‌పై పోలీసులకు ఫిర్యాదు







పెనుమూరు: ఫిర్యాదు చేస్తున్న పార్టీ మండల కన్వీనర్ విజయకుమార్‌రెడ్డి, కార్వేటినగరంలో..., గంగాధరనెల్లూరులో ఫిర్యాదు చేస్తున్న బ్రహ్మతేజ

గంగాధరనెల్లూరు / కార్వేటినగరం / పెనుమూరు: అల్లరి మూకలను రెచ్చగొట్టి ధమన కాండ సృష్టిస్తున్న చంద్రబాబు, లోకేష్‌లపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆయా పోలీస్‌స్టేషన్లలో శుక్రవారం ఫిర్యాదు చేశారు. గంగాధరనెల్లూరులో పార్టీ సోషల్ మీడియా నియోజకవర్గ కన్వీనర్ బ్రహ్మతేజ, మండల కన్వీనర్ మధన్‌తో కలిసి ఎస్ఐ రామాంజనేయులుకు ఫిర్యాదు చేశారు. కార్వేటినగరంలో పార్టీ సోషల్ మీడియా నియోజకవర్గ కో–కన్వీనర్ చరణ్‌రాజ్, ఎస్.రఫీ, నిషార్‌తో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాష్ట్రంలో అల్లర్లు సృష్టిస్తూ, ప్రభుత్వ వాహనాలను తగలబెట్టి పైశాచిక ఆనందం పొందుతున్న చంద్రబాబు, లోకేష్, అచ్చంనాయుడుపై కేసులు నమోదు చేయాలని వైఎస్సార్‌సీపీ పెనుమూరు మండల కన్వీనర్ విజయకుమార్‌రెడ్డి, పార్టీ నాయకులు ద్రాక్షాయణి, చందు, సతీష్‌తో కలిసి పోలీసులను కోరారు.